మా గురుకులం మారింది

- అత్యాధునిక వసతులతో జగ్గయ్యపేట గిరిజన గురుకుల పాఠశాల
- రూ.2.32కోట్లతో నూతన భవన నిర్మాణం
- నాడు–నేడు కింద రూ.41లక్షలు మంజూరు
పాతభవనం అభివృద్ధి
- విద్యార్థులకు మెరుగైన వసతులు
- హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


ఆధునిక హంగులతో జగ్గయ్యపేటలోని గురుకుల పాఠశాల నూతన భవనం



విశాలమైన డైనింగ్ హాల్ భవనం


డెస్క్‌టాప్‌లతో కూడిన బెంచీలపై విద్యార్థులు

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) రూపురేఖలు మారాయి. సకల వసతులు సమకూరడంతో నూతన శోభను సంతరించుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతోపాటు విద్యావ్యవస్థలో నూతన ఒరవడులకు నాంది పలుకుతున్నారు. ముఖ్యంగా పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, పాఠశాలల స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. అందుకు జగ్గయ్యపేట పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలయే నిదర్శనం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవతో జగ్గయ్యపేట పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు కార్పొరేట్ హంగులు సమకూరాయి.

నాడు కళాహీనం...

గత టీడీపీ పాలనలో ముఖ్యంగా పాఠశాల భవనాలు రంగులు వెలిసిపోయి కళాహీనంగా ఉండేవి. డార్మెటరీ, టాయిలెట్లు శిథిలావస్థకు చేరడం, సరైన ఫర్నిచర్, ఇతర వసతులు లేక విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీకావు. ఈనేపథ్యంలో ఐదేళ్ల కిందట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలుచేసిన నాడు–నేడు కార్యక్రమం పాఠశాలలు, గురుకుల విద్యాలయాల పాలిట వరమైంది. నాడు–నేడు కింద గురుకుల పాఠశాలలోని పాత భవనానికి రూ.41లక్షలతో రంగులు, టాయిలెట్లు, ఎలక్ట్రిఫికేషన్, పిల్లలు కూర్చొనేందుకు 89 బల్లలు, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణంతోపాటు అనేక మౌలికవసతులు సమకూర్చారు.

రూ.1.52కోట్లతో తరగతి గదుల నిర్మాణం

నాబార్డు నిధులు రూ.1.52 కోట్లతో విశాలమైన తరగతి గదుల నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ఉన్న తరగతి గదులు చాలక, ఉండేందుకు సరైన వసతి లేక విద్యార్థులు, సిబ్బంది అనేక అవస్థలు పడేవారు. అరకొర సౌకర్యాలతో పడుతున్న ఇబ్బందులును గుర్తించిన ప్రస్తుత ఎమ్మెల్యే ఉదయభాను వెంటనే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను వేగవంతం చేయించి త్వరితగతిన పూర్తిచేయించారు. నూతనంగా కేంద్రం నిధులు మరో రూ.80 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం కూడా పూర్తి చేయించారు. దీంతో విశాలమైన రెండు అంతస్తులలో 12 తరగతి గదులు, 16 గదులతో టాయిలెట్ బ్లాక్, ఒకేసారి 120 మంది విద్యార్థులు భోజనం చేసేలా డైనింగ్ హాల్, వాష్ ఏరియా, కిచెన్ హాల్ తదితర వసతులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. పాఠశాల ఎదుట శుభ్రంగా ఉండేలా రూ.9 లక్షలతో డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో గురుకుల పాఠశాల నూతనశోభను సంతరించుకుంది.


రూ.41లక్షలతో ఆధునీకరించడంతో నూతన శోభతో పాత పాఠశాల భవనం

సదుపాయాలు చాలా బాగున్నాయి



మా గురుకుల పాఠశాల పూర్తిగా మారింపోయింది. గతంలో తరగతి గదులు సరిగా లేవు. భోజనం చేసేందుకు ఎటువంటి సదుపాయాలు లేవు. ఎక్కడ పడితే అక్కడ కూర్చొని భోజనం చేసేవాళ్లం. నేడు సకల హంగులతో డైనింగ్ హాల్ నిర్మించారు. అందరం ఒకేచోట కూర్చొని హాయిగా తింటున్నాం.

–డి వెంకటేష్, ఎనిమిదోతరగతి విద్యార్థి

ఇంటి కన్నా మిన్నగా వసతులు..



మా బాబు గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. గతంతో పోలిస్తే పాఠశాలలో ప్రస్తుతం ఇంటి కన్నా సౌకర్యాలు బాగున్నాయి. పిల్లలు ఏ సమస్యలు చెప్పడం లేదు. పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడంతోపాటు నాణ్యమైన ఆహారాన్ని పెడుతున్నారు. ఉచితంగా ట్యాబ్‌లు కూడా ఇచ్చారు.

–బాణావత్ ఉష, పెనుగంచిప్రోలు

బాబుది కాపీ మేనిఫెస్టో : వేల్పుల


వేల్పుల రవికుమార్

పెనుగంచిప్రోలు: టీడీపీ అధినేత చంద్రబాబు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోని కాపీ కొట్టి తన మేనిఫెస్టోను ప్రకటించారని నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ విమర్శించారు. పెనుగంచిప్రోలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే రాష్ట్రానికి సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సి ఉందన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన టీడీపీ అధికారం కోసం ఇతర పార్టీల మేనిఫెస్టోను కాపీ కొట్టిందని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరడంతో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సీఎం జగన్‌ను చంపేస్తే ఏమవుతుందని అనడంతోపాటు దెందులూరు సభలో కూడా ఆనోటిని శాశ్వతంగా మూసేయాలని మాట్లాడటం చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలకు నిదర్శమన్నారు. ఆ వ్యాఖ్యలను చంద్రబాబు తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు.

కేసు నమోదు

కంచికచర్ల : మూడు బైక్‌లపై ఆరుగురు వ్యక్తులు వచ్చి ఓమహిళ చేతిలోని సెల్‌ఫోన్, నగదు అపహరించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెంకె వెంకట సత్యసుబ్రహ్మణం బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..చందర్లపాడు మండలం వెలది కొత్తపాలెంకు చెందిన ఎస్.రోజా అనేమహిళ కొంతకాలంగా కంచికచర్లలోని పరిటాల కోల్డ్ స్టోరేజ్ దగ్గరలోని వేస్ట్ వాటర్ బాటిల్ స్క్రాప్ దుకాణం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆమె తండ్రి తిరుపతిరావు వద్ద ఉంటోంది. ఈక్రమంలో ఏప్రిల్ 30వతేదీ రాత్రి దుకాణం సమీపంలో మరోవ్యక్తితో మాట్లాడుతుండగా, మద్యంతాగిన మత్తులో ఆరుగురు వ్యక్తులు మూడు బైక్‌లపై వచ్చి వారిద్దరిని బెదిరించి, ఆమెచేతిలోని సెల్‌ఫోన్, రూ.2వేల నగదును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని నందిగామ, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లో గురువారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ వి.రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ మండలం చందాపురం సమీపంలోగల సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు నిర్వహిస్తుండటంతో ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేయాలి

నందిగామ: నందిగామ నియోజకవర్గం ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావును గెలిపించాలని తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అధ్యక్షుడు జై భీమ్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగ కృషిచేస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావును గెలిపించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ కార్యకర్తలంతా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అండగా ఉండి వారి విజయానికి కృషిచేయాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు



నందిగామ: వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమని డాక్టర్ కొంకిమళ్ళ లీలాప్రసాద్ అన్నారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో గురుస్వామి కొప్పు రమేష్ పర్యవేక్షణలో కొత్తబస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. నిత్యం చల్లటి తాగునీరు అందించడంతోపాటు మధ్యాహ్నం సమయంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గురుస్వాములు ఏచూరి శ్రీనివాసరావు, నరసింహారావు, జంగాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



జగ్గయ్యపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల నాలుగు, ఆరు తేదీలలో ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేసేందుకు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఓటర్ల స్లిప్పుల పంపిణీ కూడా 70శాతం మేర పూర్తయిందన్నారు. ఏఆర్‌ఓలు తహసీల్దార్ శేషగిరి, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, డీటీ నాగరాజు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పండుటాకులతో చంద్రబాబు ఆటలు



కంచికచర్ల : నాలుగేళ్లుగా ప్రతినెలా ఒకటో తేదీనే అందుతున్న ఫింఛన్, టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రల కారణంగా రెండునెలలుగా సజావుగా అందకపోతుండటంపై పింఛన్‌దారులు మండిపడుతున్నారు. పింఛన్ కోసం కొందరు వృద్ధులు బుధవారం ఆయా గ్రామాల్లోని సచివాలయానికి వెళ్లగా, బ్యాంకుల్లో జమచేస్తామని ఉద్యోగులు చెబుతుండటంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. వలంటీర్ల ద్వారా పింఛన్‌ను పంపిణీ చేయించవద్దంటూ చంద్రబాబుతోపాటు ఆయన అనుయాయులు మార్చిలో ఎన్నికల కమిషన్‌ను కోరడంతో ఏప్రిల్ నెలలో ఒకటో తేదీన అందాల్సిన పింఛన్ కాస్తా మూడు, నాలుగురోజులు ఆలస్యంగా అందిందని పింఛన్‌దారులు వాపోయారు. చంద్రబాబు విజ్ఞప్తి మేరకు మే నెల పింఛన్‌ను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని, బ్యాంకు ఖాతాలు లేనివారికి.. దివ్యాంగులకు ఇంటివద్దనే పంపిణీ చేయాలని ఎన్నికల అధికారులు ఆదేశించడంతో ప్రభుత్వాధికారులు పింఛన్ నగదును బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు. ఇప్పుడు పింఛన్ నగదు కోసం మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరగక తప్పేలా లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతినెలా ఒకటోతేదీన ఠంచన్ అందే పింఛన్ నగదు చంద్రబాబు నిర్వాకం కారణంగా సకాలంలో అందడం లేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం పండుటాకులమైన తమ జీవితాలతో చంద్రబాబు ఆటలాడుకోవడం తగదని పింఛన్‌దారులు శాపనార్థాలు పెడుతున్నారు.

కార్మికులకు అండగా ప్రభుత్వం

విప్ ఉదయభాను


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తూ వారికి అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని సామినేని విశ్వనాథం కార్మికనగర్‌లో నిర్వహించిన మే డే వేడుకల్లో ఆయన పాల్గొని ఆయా కార్మిక సంఘాల భవనాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ కార్మికులు దేశంలోనే ఒక బలమైన శక్తి అని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మరెక్కడా లేనివిధంగా పట్టణంలో 14 కార్మిక యూనియన్ల వారికి స్థలాలను కేటాయించి సొంత భవనాలు నిర్మించుకునేందుకు సహకారం అందించానని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కార్మికుల కోసం అనేక మంచి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ రాగానే ఈ 14 కార్మిక సంఘాల భవనాలకు పట్టాలను అందజేస్తామని, కార్మికుల కోసం మీటింగ్ హాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నెడ్ క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజ గోపాల్(చిన్నా), పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బద్దూనాయక్, పార్టీ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ముజీబ్, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, మాజీ జడ్పీటీసీ చల్లా వైకుంఠరావు, న్యాయవాది బూడిద నరసింహారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, ఆర్టీసీ యూనియన్ నాయకుడు గంటా భాస్కరరావు, ఎస్‌ఎస్పీ సైదా పాల్గొన్నారు.

ఘనంగా గురు విశ్వస్ఫూర్తి జన్మదిన వేడుకలు

పెనుగంచిప్రోలు: స్థానిక శింగవరంరోడ్డులోని స్ఫూర్తి యూనివర్స్‌లో ఆధ్మాత్మిక గురువు గురు విశ్వస్ఫూర్తి 84 వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పీఠ పూజ, హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తంబరేణి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పేదలకు వస్త్రదానం చేశారు. ఈకార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అజోల్ల తొట్ల ఏర్పాటుపై అవగాహన

నందిగామ:మండలంలోని పల్లగిరి గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం అజోల్ల తొట్ల తయారీపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పవన్ కుమార్, పవన్‌సాయి మోహిత్, సాయితేజ, పవన్ నాగేశ్వర్ గ్రామంలోని పాడిరైతులకు అజోల్ల వినియోగించడంతో పశువులకు కలిగే మేలు, అజోల్ల ఇంట్లోనే తయారు చేసుకునే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాడి రైతుల ఇళ్లలో విద్యార్థులు స్వయంగా అజోల్ల తొట్లు ఏర్పాటు చేశారు.


మోసానికి మారుపేరు చంద్రబాబు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


గనిఆత్కూర్‌లో డాక్టర్ జగన్‌మోహనరావుకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

కంచికచర్ల : గత ఎన్నికల్లో పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, ఈ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మరోసారి మోసగించేందుకు యత్నిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. మోసానికి మారుపేరు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. మండలంలోని బత్తినపాడు, మున్నలూరు, కునికెనపాడు, గనిఆత్కూరు, చెవిటికల్లు, మోగులూరు గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఆయనకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వందలాది కోట్లతో నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణంతోపాటు నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు వివరించారు. ప్రచారంలో బత్తినపాడు, చెవిటికల్లు, కునికెనపాడు, మోగులూరు సర్పంచులు జంగా సంతోషరావు, బుడ్డి విజయలక్ష్మి, బండారుపల్లి సత్యనారాయణ, షేక్ మొయిద్దీన్‌బీ, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, వైఎస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, నాయకులు మంగిశెట్టి పుల్లారావు, షేక్ హుస్సేన్, మోహనరావు వెలగలేటి బాబు, వెలగలేటి వాసు, బళ్లా రాములు, రాయల నరసింహారావు, తేళ్ల శ్రీనివాసరావు, పరిటాల రాము, వేల్పుల రమేష్, బుడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు


పార్టీలో చేరిన షేక్ సత్తార్, కౌన్సిలర్ సిరాజున్, అల్లి ఆజీఘర్‌లతో కేశినేని నాని, ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: టీడీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ సత్తార్, ఆయన సతీమణి, 28వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ షేక్ సిరాజున్, ముస్లిం మతపెద్ద అల్లి అజీఘర్ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఉదయభాను, నాని సాదరంగా స్వాగతం పలికారు.ఈసందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ చంద్రబాబు బూటకపు మాటలు ప్రజలు ఎవరూ నమ్మవద్దని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ తీసివేయాలని చంద్రబాబు మోదీతో జతకట్టి తీసివేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. షేక్ సత్తార్ మాట్లాడుతూ ముస్లింలకు, వైఎస్సార్ సీపీలోనే తగిన గౌరవం లభిస్తుందని గుర్తించి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. బీజేపీతో టీడీపీ జతకట్టడం తమకు ఏమాత్రం ఇష్టంలేదని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం


మున్సిపల్ కార్మికురాలిని సన్మానిస్తున్న జడ్జి శ్రావణి, న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: మే డే సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో బుధవారం జగ్గయ్యపేట మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి మాట్లాడుతే కార్మికచట్టాలపై కార్మికులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు అధ్యక్షత వహించగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యలమంచి రాజేంద్ర ప్రసాద్, కోశాధికారి మెట్టెల ఆంజనేయులు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ జగజ్జీవన్‌రావు, లేడీస్ సెక్రటరీ శ్రీనివాసవి, జాయింట్ సెక్రటరీ బూడిద నరసింహారావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గుంటక లక్ష్మీనారాయణ, న్యాయవాదులు ఎం.గోపీనాథ్, జల్లా తిరుపతిరావు, రామారావు, దాసరి నాగేశ్వరరావు, హనుమంతరావు, రత్నబాబు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: స్థానిక సబ్‌జైలులో బుధవారం న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మే డే ను పురస్కరించుకుని నిర్వహించిన సదస్సులో న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన

నందిగామ: ఎన్నికల సమయంలో అనవసరమైన వివాదాలకు పోయి ఇబ్బందులు పడవద్దని ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. మండలంలోని సోమవరం, దాములూరు గ్రామాల్లో బుధవారం రాత్రి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా హనీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. ఎస్సై దుర్గా మహేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా మే డే వేడుకలు


వత్సవాయిలో మే డే వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు


కంచికచర్లలో...


నందిగామలో...

వత్సవాయి : మే డే వేడుకలను మండలంలో సీఐటియూ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వత్సవాయిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద నిర్వహించిన వేడుకల్లో సీఐటీయూ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు మాట్లాడుతూ కార్మికులకు రూ.26 వేలు వేతనాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో సమగ్ర చట్టం చేయడంతోపాటు ఆటో, హమాలీ, లారీ, కార్మికులకు సంక్షేమబోర్డులు ఏర్పాటుచేయాలని కోరారు. పోలంపల్లి, మంగొల్లు, కన్నెవీడు, కంభంపాడు, గ్రామాల్లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, అంగన్‌వాడీ, ఆశా, హమాలీ, ఆటో, రిక్షా, ముఠా యూనియన్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కంచికచర్లలో

కంచికచర్ల : మే డేను పురస్కరించుకుని స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద మే డే వేడుకులు నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సయ్యద్ ఖాసీం, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, నాయకులు బెజ్జం భూషణం, సుధాకర్, కార్మికులు పాల్గొని అరుణ పతకాన్ని ఎగురవేశారు. అదేవిధంగా స్థానిక రాజ్యలక్ష్మీ గ్యాస్ ఏజన్సీ వద్ద, పరిటాల, కీసర, గండేపల్లి, చెవిటికల్లు, కొత్తపేట, మోగులూరు తదితర గ్రామాల్లోనూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.

నందిగామలో..

నందిగామ: నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఎగురవేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద, గ్యాస్ స్టేషన్‌తోపాటు ఆయా ప్రాంతాల్లోని ఆటో వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పాల్గొని అరుణ పతాకాన్ని ఎగురవేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మే డే వేడుకలు నిర్వహించగా, యూనియన్ అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఎగురవేశారు. రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నందిగామ, చందర్లపాడు మండలాల్లో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకుడు రాంబాబు అరుణపతాకాన్ని వేగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోరుతూ ప్రచారం



వత్సవాయి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) విజయాన్ని కోరుతూ ఆపార్టీ నాయకులు బుదవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వత్సవాయి, మక్కపేట, పోలంపల్లి, భీమవరం, మంగొల్లు, కంభంపాడు, దబ్బాకుపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరధ్వాజ్, కనగాల రమేష్, కొండబోలు బ్రహ్మం, గుడేటి శారమ్మ, ఆళ్ల సత్యంకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: కేశినేని నాని, సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ పెనుగంచిప్రోలులోని ఆయావార్డుల్లో ఆపార్టీ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో జెడ్పీటీసీ పూట్ల నాగమణి, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, చేని కుమారి, జి.నరసింహారావు, బాడిశ పాపారావు, కాకాని పద్మ, కాశీరాజ్, బత్తుల రామారావు, జంగం వీరమ్మ, డి.శ్రీనివాసరావు, తమ్మిశెట్టి సోమయ్య, కె.వెంకటరమణ, బొమ్మిరాణి, సుశీల, స్రవంతి పాల్గొన్నారు.